క్లుప్తంగా

వేలంలో రూ.7.34 లక్షల ఆదాయం

పెద్దాపురం: స్వయం భూ శృంగార వల్లభ స్వామి ఆలయం కొలువైన తిరుపతి పంచాయతీకి వివిధ వేలం పాటల ద్వారా రూ.7.34 లక్షల ఆదాయం సమకూరిందని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రమణ తెలిపారు. శుక్రవారం ఇక్కడి పంచాయతీ ఆవరణలో వారం వారం ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్, వివిధ దుకాణాల ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించారు. వాహనాల పార్కింగ్‌ను గ్రామానికి చెందిన బేతిసీడి సూర్యారావు రూ.5.57 లక్షలు, వివిధ దుకాణదారుల నుంచి పన్నుల వసూళ్ల నిమిత్తం నల్లల ఆది వెంకటరమణ రూ.1.77 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. ఇలా పంచాయతీకి ఆదాయం సమకూరిందని రమణ తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి భార్గవ్, రాజు మత్తాల తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సాంకేతిక నైపుణ్యంపై అవగాహన కల్పిస్తున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: విద్యార్థి దశలోనే సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా స్కిల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల ద్వారా టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు పలు మెలకువలను వివరించారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించడం ద్వారా పోటీ పరీక్షల్లో రాణించవచ్చన్నారు. ఉపాధ్యాయులు జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల నుంచి జారిపడి ఇద్దరి మృతి

సామర్లకోట: వేర్వేరు రైళ్ల నుంచి జారిపడి ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పిఠాపురం నుంచి సామర్లకోట వస్తున్న గుర్తు తెలియని రైలు నుంచి ఓ వ్యక్తి(40) కేఎం నంబరు 630 వద్ద, సామర్లకోట నుంచి పిఠాపురం వైపు వెళ్తున్న రైలు నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి జారిపడి మృతి చెందారన్నారు. రైల్వే కీమెన్ పి.శివకృష్ణ సమాచారం మేరకు పోలీసులకు సమాచారం తెలిపామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై లోవరాజు తెలిపారు.

రైల్వే ప్రయాణికులకు గాయాలు

సామర్లకోట: విశాఖపట్నం నుంచి వెళ్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఫుట్‌పాత్ మెట్టుపై ఇద్దరు ప్రయాణికులు కూర్చున్నారు. ఈ నేపథ్యంలో వారికి తుని దాటిన ప్లాట్‌ఫామ్ తగిలి గాయపడ్డారు. దీంతో వారి రెండు కాళ్లూ కొట్టుకుపోయాయి. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఈ రైలును ఆపి వారికి వైద్యుడు సూరిబాబు ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరంలో దిగి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు అమరావతి ఎక్స్‌ప్రెస్ సామర్లకోట స్టేషన్‌లో 15 నిమిషాలు నిలిచిపోయింది. దాని వెనుక వస్తున్న వందే భారత్ రైలు 15 నిమిషాలు నిలిచిపోయినట్లు రైల్వే మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు.

నాడు నిలబడి.. నేడు తడబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం కాని అభివృద్ధి పనులు
- గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో 40 పాఠశాలల అభివృద్ధి
- ప్రస్తుతం పనుల్లో తీవ్ర జాప్యం!



కొత్తపల్లి మండలం వాకతిప్పలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణం

పిఠాపురం: ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం మన బడి నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టింది. నియోజకవర్గంలో పలు పాఠశాలలను ఈ పథకంలో అభివృద్ధి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. నియోజకవర్గంలో 28 జిల్లా ప్రజాపరిషత్,19 ప్రాథమికోన్నత, 125 మండల ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో భవనాల కొరత, శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, సిబ్బంది కొరత వంటి సమస్యలకు గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకంతో అప్పటి ప్రభుత్వం పరిష్కారం చూపడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి

నియోజకవర్గంలో నాడు–నేడు పథకం తొలి విడత కింద సుమారు రూ.10 కోట్లతో 40 పాఠశాలలను అభివృద్ధి చేశారు. అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తవ్వగా 150కి పైగా అదనపు గదులు నిర్మించారు. వసతులు కల్పించడంతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి. ఈ పథకంలో పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పాఠశాలల భవనాలను తీర్చిదిద్దారు. ఫర్నీచర్, కనువిందు చేసే రంగులతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు.

రెండో విడతలో..

నాడు–నేడు రెండో విడతలో రూ.41.25 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో 85 పాఠశాలల్లో 214 అదనపు గదుల నిర్మాణం పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాల అభివృద్ధికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు కేటాయించారు. తొలి విడత విజయవంతంగా పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి కాగా రెండో విడత గొల్లప్రోలు మండలంలో 11 పాఠశాలల్లో 65 అదనపు గదుల నిర్మాణానికి రూ.7.80 కోట్లు మంజూరు చేశారు. పిఠాపురంలో 20 పాఠశాలల్లో 38 అదనపు గదుల నిర్మాణానికి రూ.12.91 కోట్లు మంజూరు చేశారు. కొత్తపల్లి మండలంలో 54 పాఠశాలల్లో 111 అదనపు గదుల నిర్మాణానికి రూ.20.54 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటివరకూ అన్ని పాఠశాలల్లోనూ 70 నుంచి 80 శాతం పనులు పూర్తవ్వగా మిగిలిన పనులు కొత్త ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది. నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో భవనాలు సరిపడక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే కొత్త ప్రభుత్వం నాడు–నేడు పనులను జాప్యం చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

పనులు పూర్తి చేయడానికి చర్యలు

తొలి విడత నాడు–నేడు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. రెండో విడత పనులు పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రారంభించిన అన్ని పాఠశాలల్లోనూ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నిధులు ఉన్నంతలో పనులు తొందరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం. ప్రభుత్వ ఆదేశాలతో పనులు నిర్వహించాల్సి ఉంది.

– వరప్రసాద్, ఎంఈఓ, పిఠాపురం

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల స్థలదాత చల్లా చిన్నబాబు, జెడ్పీటీసీ ఉలవకాయలు నాగలోవరాజు, సర్పంచ్ దొండపాటి లోవతల్లి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎన్డీఏ కూటమి నేతలు ఓదూరి నాగేశ్వరరావు, మల్లిపూడి వీరబాబు, బుద్దాల చంటి, సూరిశెట్టి జయ కృష్ణ, పాఠశాల హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేడు మొక్కలు నాటే కార్యక్రమం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కాపు కల్యాణ మండపంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. దీనికి మున్సిపల్ కౌన్సిలర్లు హాజరు కావాలన్నారు.

మా పూజలు అందుకో మరిడమ్మా..



మరిడమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో పెద్దాపురం మరిడమ్మ



శాకంబరి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోటలోని నూకాలమ్మ అమ్మవార్లు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణ అధికారులు రామ్మోహన రావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆషాఢ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని వివిధ రకాల పుష్పాలతో అమ్మవార్లను అలంకరించారు. మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ పర్యవేక్షించారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

పిఠాపురం: గొల్లప్రోలు కరణంగారి తోట ఏరియాలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయ పండితులు పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన



బీచ్ రోడ్డులో శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిషోర్

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు గ్రామాల ప్రజలకు శ్మశాన వాటిక కోసం బీచ్ రోడ్డులో ఎస్పీజీఎల్ విద్యుత్‌ప్లాంట్ సమీపంలో కేటాయించిన స్థలాన్ని శుక్రవారం కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ పరిశీలించారు. ఉప్పాడ శివారు సుబ్బంపేట, మాయపట్నం, కొత్తపట్నం గ్రామాలకు శ్మశానవాటిక లేకపోవడంతో ఉప్పాడ బీచ్ రోడ్డు పక్కనే దహన సంస్కారాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఆయా గ్రామాల ప్రజలు సమస్యను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు బీచ్‌రోడ్డులో విద్యుత్‌ప్లాంటు సమీపంలో అధికారులు స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. పూర్తి వివరాలతో నివేదికను కలెక్టర్ అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



చిత్రాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెద్దాపురంలో స్వచ్ఛతా వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పద్మావతి అన్నారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వచ్ఛతా అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం ఆయా వార్డుల్లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పెద్దాపురం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు తెలిపారు. ఇటీవల పరదేశమ్మ కాలనీలో రోడ్డు పొడవునా చెత్తను వేసి అధ్వానంగా చేశారన్నారు. అక్కడ చెత్తను పూర్తి స్థాయిలో తొలగించి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎవరైనా ఇక్కడ చెత్తను వేస్తే ప్రజలు అడ్డుకోవాలన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించుకోవాలని దావీదురాజు కోరారు.

చిత్రాడలో..

పిఠాపురం: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పిఠాపురం మండలం ప్రత్యేక అధికారి, మైనార్టీస్ ఈడీ సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. చెత్త నిల్వ ప్రాంతాలను గుర్తించి ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికి వారు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బందారు చిన్నారావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సునీత, పంచాయతీ సెక్రటరీలు నాగేశ్వరరావు, వెంకట్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి



వేట్లపాలెంలో విద్యార్థినితో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ శివరామ కృష్ణయ్య

సామర్లకోట: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పాఠ్య పుస్తకాలను చదవడం, నోట్ పుస్తకాలు రాయడంపై శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం వేట్లపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాల రుచి చూశారు. విద్యా ప్రవేశ, సంసిద్ధత, శిక్షా సప్తాహ కార్యక్రమాలపై హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో లాగిన్ అయి ప్రతి ఉపాధ్యాయుడు అప్లోడ్ చేయాలని సూచించారు. ఇంగ్లిష్‌లో అంశాలను చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. శనివారం నుంచి 29వ తేదీ వరకూ జరిగే శుభదిన్ భోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రూపులమ్మకు ఘనంగా సారె సమర్పణ

ఏలేశ్వరం: అషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో వేంచేసిన రూపులమ్మ అమ్మవారికి శుక్రవారం ఘనంగా సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని సంఘాల ఆధ్వర్యంలో 108 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి పట్టణంలోని పలు వీధుల మీదుగా సారెతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలు భజన బృందాల సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, మాతృశక్తి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరి, ఇందిరాదేవి, దుర్గావాహిని అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సూర్యాకుమారి, పి.లలిత, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు..

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో వేంచేసిన కనకదుర్గమ్మకు శుక్రవారం సారె సమర్పించారు. స్థానిక గణేష్, గద్వాల్, భౌమా యూత్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని వేగి రాజేష్ ఇంటి నుంచి అమ్మవారి సారెతో మహిళలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చిల్లంగి చింతల తోటలో వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిల్లంగిలో కనక దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు



నిర్లక్ష్యంతో వ్యవహరించి..

- యమపాశాల్లా విద్యుత్ తీగలు
- చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు



రాయుడుపాలెంలో ఓ ఇంటిని ఆనుకుని ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు

కాకినాడ రూరల్: నిత్య జీవితంలో విద్యుత్ వినియోగం ఎంత అవసరమో.. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా అంతే ప్రమాదం. జనావాసాలతో పాటు అవసరాలూ పెరిగాయి. దానికి అనుగుణంగా విద్యుత్తు వ్యవస్థ లేక యమపాశాలై కాటేస్తున్నాయి. వానాకాలం వచ్చిందంటే చాలు ఇవి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో గృహ విద్యుత్ కనెక్షన్లు సుమారు 2.2 లక్షల వరకూ ఉన్నాయి. రూరల్‌లో రమణయ్యపేట, ఏపీఐఐసీ కాలనీ, వాకలపూడి, వలసపాకల, సర్పవరం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాల్లో చాలాచోట్ల విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అవి చేతికందే ఎత్తులో ఉన్నాయి. కాకినాడ అర్బన్ సురేష్‌నగర్, శశికాంత్‌నగర్, బొందగుంత తదితర ప్రాంతాల్లో కేబుల్ తీగలు, విద్యుత్ తీగలతో కలసి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు యమ పాశాలుగా మారుతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతానికి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

వానాకాలం.. అప్రమత్తం

ప్రస్తుతం వానలు దంచి కొడుతున్నాయి. మరో ఆరు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే వాతావరణం మారి చినుకులు పడుతున్నాయి. ఈ వానలతో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు పూర్తిగా తడుస్తున్నాయి. విద్యుత్ తీగలతో పలు కేబుల్ వైర్లు ప్రమాదభరితంగా మారాయి. తడిచిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ ప్రసరించే ప్రమాదం ఉంది. నేలంతా తడిచి ఉండడంతో వానలు పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగల వద్దకు జనాలు వెళ్లరాదు. ఒకవేళ స్తంభాలను తాకితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పొలాల్లో పనిచేసే వ్యవసాయ, కూలీలు మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికైనా స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను, చెట్ల కొమ్మల నుంచి వెళ్లిన తీగలను సరిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేటకు వాయుగండం

- ప్రతికూల వాతావరణంతో అల్లకల్లోలంగా మారిన సముద్రం
- చేపల వేట నిలిపివేసిన మత్స్యకారులు
- కోతకు గురవుతున్న సముద్ర తీరం



కొత్త చోడిపల్లిపేటలో కోతకు గురవుతున్న తీరం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మండలంలోని తీరం ప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో వారం రోజులుగా మత్స్యకారులు బోట్లపై చేపల వేటను నిలిపివేశారు. వేట లేకపోవడంతో గంగపుత్రులు ఉపాధికి ఇబ్బందులు పడుతున్నారు.

విస్తారంగా వర్షాలు

వాయుగుండం ప్రభావంతో కోనతీర ప్రాంతంతో పాటు మెట్ట, పల్లపు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అన్ని గ్రామాల్లోనూ పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈదురు గాలులు, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సురక్షిత ప్రాంతాలకు బోట్లు

సముద్రం అల్లకల్లోలంగా మారడంతో వేటకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారుల సూచనల మేరకు మత్స్యకారులు తమ బోట్లును తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించుకుని వేటకు విరామం ప్రకటించారు. ఇప్పటికే తీరంలోని అన్ని గ్రామాల్లోనూ మత్స్యకారులను అప్రమత్తం చేశామని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కాగా మండలంలో దాదాపుగా 480 బోట్లు ఉన్నాయి. వేట ద్వారా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 10 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. సముద్రంలో వేటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మత్స్యసంపదపై ఆధారపడిన గంగపుత్రులు, చిరు వ్యాపారాలు ఇబ్బందులు పడుతున్నారు. సముద్రంలో వేటకు అనుకూల పరిస్థితులు ఏర్పడే వరకూ ఈ ఇబ్బందులు తప్పవని తీరప్రాంత మత్స్యకారులు వాపోతున్నారు.

సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో పాటు ప్రతిరోజూ పోటుపాట్లు కాలంలో సముద్రం ముందుకు వస్తూ వెనక్కి వెళ్లూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సముద్రతీరంలో గట్టు కోతకు గురవుతోంది. సముద్రంలో లక్షలాది టీఎంసీల నీరు చేరడంతో క్రమంగా సముద్ర మట్టం పెరుగుతోంది. దీంతో ఏటా తీరం కోతకు గురవుతోంది. ఇప్పటికే ఉప్పాడ, మూలపేట తదితర ప్రాంతాల్లో కొన్ని మత్స్యకార గ్రామాలు సముద్రంలో కలిసిపోవడంతో తమకూ ప్రమాదం తప్పదని తీరప్రాంత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం, ఊపరితల ఆవర్తనం ఏర్పడటంతో మరో మూడు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో వేట మరికొన్ని రోజులు ఉండదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులను అప్రమత్తం చేశాం



వాయుగుండం నేపథ్యంలో తీరప్రాంతంలో మత్స్యకార గ్రామాలను అప్రమత్తం చేశాం. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ప్రస్తుత వాతావరణం చేపల వేటకు ఏమాత్రం అనుకూలం కాదు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదు.

–సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని



పెరుమాళ్లపురం తీరంలో నిలిచిపోయిన బోట్లు